# ఋణాన్నభుక్కుల కథ



ఔను, దురాశ దుఃఖానికి చేటు అన్నాడు సుబ్బన్న. పూర్వ మొక ఋణాన్నభుక్కు ఇలాగే తిరిగి తిరిగి ఎక్కడో ఒక చోట ఒక మూడ

అప్పు తెచ్చుకుని మూడు ఝాముల వేళ ఇంటికిపోతూ, రాజవీధి మొగలో దూరంగాఋణాశనుడనే వాడిని, వాడిమొహాన్ని చూసి వాడికికూడా ఆనాడు ఓమాడ దొరికి ఉంటుందని, తను తన యింటి బాధను మరొక్కసారి ఏకరువు పెడితే ఋణాశనుడి రొంటిలో ఉండగల మాడలో సగబాలు అప్పు సంపాదిస్తే, మర్నాడు తనకి వేతనం రాగానే తీర్చిపారెయ్యొచ్చనీ ఆశపడి పనిమల్లె ఋణాశనుడికి ఎదురేగి పలకరించి తన పాచిక వేయబోయాడు. ఆ వరకే ఈ ఒయినం పసిగట్టిన ఋణాశనుడు ఇతనికన్నా ధాటిగా దుఃఖించి, తాను ఇవ్వకపోవడమే కాక, ఋణాన్న భుక్కు రొంటిన వున్న మాడాకూడా అప్పుగా వడేసి పుచ్చుకు తనదారిన పోయాడు అన్నాడు సుబ్బన్న.

ఈ కథ లాలకించిన చెట్టుమీద కాకి మటుకు కావుకేకపెట్టి అయితే ఔ గాక, మహా చక్కటి నీతి కథలు గదా, సుబ్బన్నగారూ మీరేం అనుకోకండిగాని, నా మాటవిని మీ పుట్టని అప్పివ్వండి. మళ్ళీ వాళ్ళు కాళీచేసి యిచ్చేస్తారు అని ఊరుకుంది.

చీమలూ పాములూ పైకిచూసి నవ్వుకున్నాయి. ఒకటి రెండు జాలిగా కూడా చూశాయి.